చెరువుల్లోకి మురుగునీటికి చెక్

- చెరువులు కళకళలాడేలా చర్యలు
- సహజ వనరుల పరిరక్షణ అందరి బాధ్యత: ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, మార్చి 14: పరిశుభ్రమైన నీటితో చెరువులు కళకళలాడేలా చర్యలు చేపడుతున్నట్లు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. చెరువులలోకి మురుగు నీరు రాకుండా ప్రత్యేక పైప్‌లైన్‌ల ద్వారా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువులో రూ. 2.74 కోట్లతో చేపడుతున్న సుందరీకరణ, మురుగు నీటి మళ్లింపుకు చెందిన పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే గాంధీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్లాది నిధులను వెచ్చించి చెరువులను సుందరీకరిస్తున్నామన్నారు. డైవర్షన్ ఛానళ్ల ద్వారా మురుగు నీటి మళ్లింపు, వర్షపు నీరు చేరేలా లైన్ల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. ట్రీట్ మెంట్ ప్లాంట్ల ద్వారా మురుగు నీటి శుద్ధితో చెరువులను సంస్కరిస్తున్నట్లు, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పచ్చదనం పెంపు, విలువైన చెరువు స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేసారు. సహజ వనరుల పరిరక్షణ అందరి బాధ్యతని, వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను చెరువులలో వెయ్యవద్దని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేత శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

పార్టీ బలోపేతానికి కృషి

అల్లాపూర్ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌టీపీ సీనియర్ నాయకుడు వేముల సత్యం కాంగ్రెస్‌పార్టీలో చేరాడు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సత్యంకు కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డివిజన్‌లో కాంగ్రెస్‌పార్టీని బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని సత్యం పేర్కొన్నారు.

– అల్లాపూర్, మార్చి 14

రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొప్పిశెట్టి దినేశ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 14

రక్తదాన శిబిరానికి ఆహ్వానపత్రిక అందజేత

కుత్బుల్లాపూర్, మార్చి14: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను గురువారం నియోజకవర్గానికి చెందిన పలు కుల, మత సంఘాలతో పాటు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. క్యూసీసీఏ చైర్మన్, జీడిమెట్ల గ్రేస్ కాస్పల్‌చర్చ్ పాస్టర్ శౌరి బొల్లేదు ఆధ్వర్యంలో పాస్టర్లు కలిసి ఈ నెల 16న గాస్పెల్ చర్చ్‌లో కలిసి జరిగే మెగా రక్తదాన శిబిరానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జాషువా, స్మీత్‌బాబు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఈ నెల 10న సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నిర్వహించిన ల్యాక్రసీ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి రాష్ట్రీయ స్థాయి ల్యాక్రసీ వర్క్‌షాప్, శిక్షణను షాపూర్‌నగర్ క్యాపిటల్ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ సత్యనారాయణ ఎమ్మెల్యేను కలిసి వివరించారు. ఈనెల 26న ఆగ్రాలో జరగనున్న జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఫాస్టర్లు

ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మలేషియాలోని 'తితివాంగ్సా కౌలాలంపూర్ స్టేడియం'లో జరిగిన 13వ సైలెంట్ నైట్ కరాటే కప్-2024 పోటీల్లో ప్రగతినగర్‌కు చెందిన బుంగా భార్గవ్, ముత్యాల భిల్లారి సత్తాచాటారని 'ట్రెయిన్ యువర్ సెల్ఫ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ'లో కోచ్ కోటకొండ నవీన్‌కుమార్ గౌడ్ తెలిపారు.

– దుండిగల్, మార్చి14

లింగంపల్లి గ్రామంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నాగేందర్ యాదవ్

డివిజన్ అభివృద్ధే ప్రధాన ధ్యేయం

- కార్పొరేటర్ రాగం నాగేందర్

శేరిలింగంపల్లి, మార్చి 14: శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని లింగంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను కార్పొరేటర్ పరిశీలించి, అనంతరం లింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోరింగ్‌ను ప్రారంభించారు. అలాగే స్థానిక బస్తీ దవాఖానను సందర్శించి రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపల్లి గ్రామంలో 90 శాతం మేర సీసీ రోడ్లు పూర్తయ్యాయని, మిగిలిన రోడ్లను త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి రోడ్డు నాణ్యంగా ఉందా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాంచందర్, అశోక్, అజీమ్, సుభాశ్, విష్ణు వర్ధన్ రెడ్డి, కె.రవి, మల్లేశ్‌గౌడ్, యాదగిరి, రాజారెడ్డి, రాకేశ్, సాయి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యానగర్ ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లను చేయించాలని గురువారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేసిన ఈద్గా కమిటీ సభ్యులు.

– మాదాపూర్, మార్చి 14

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

మురుగు సమస్యలకు శాశ్వత పరిష్కారంగా పటిష్టమైన డ్రైనేజీ నిర్మాణాలను చేపడుతున్నట్లు కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ మొగులమ్మ కాలనీ నూతనంగా ఆ నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించి, ప్రజలకు మౌలిక సౌకర్యాల కల్పనే అంతిమ లక్ష్యంగా కృషి చేస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో జాన్, భాస్కర్, మల్లేశ్, నాగరాజు, సాయి గౌడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్, మార్చి 14

ప్రాధాన్యతాక్రమంలో పనులు చేయాలి

కాలనీలు, బస్తీల్లో అభివృద్ధి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేయాలని కార్పొ రేటర్ మందడి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం వసంతనగర్ కాలనీ రోడ్డు నం.4లో సమస్యలను అధికారులతో కలిసి పరిశీలించారు. డ్రైనేజీ పనులను పరిష్కరించిన తర్వాతే అంతర్గత రోడ్లను బాగుచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, వసంతనగర్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు, డైరెక్టర్లు పాల్గొన్నారు. –కేపీహెచ్‌బీ కాలనీ,మార్చి 14

జనసేన ఆవిర్భావ వేడుకలు

కేపీహెచ్‌బీ కాలనీలోని జనసేన కార్యాలయం, కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ టెంపుల్ బస్టాప్‌లో ఆవరణలో జనసేన పార్టీ ఆవిర్భావం సందర్భంగా గురువారం ఆ పార్టీ జెండాను ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్‌చేసి పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నేతలు, కో ఆర్డినేటర్లు, వీర మహిళలు, జన సైనికులు పాల్గొన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 14

పరిశోధన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య పిల్లలమర్రి రాములు తదితరులు

పరిశోధన గ్రంథం ఆవిష్కరణ

కొండాపూర్, మార్చి 14: మహా కావ్యమైన ఆంధ్ర మహాభాగవతంపై పరిశోధన చేయడం గొప్ప విషయమైతే అందులోని అలంకారాలపై సమగ్రంగా అధ్యయనం చేయడం మరింత గొప్ప విషయమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్య పిల్లలమర్రి రాములు అన్నారు. గచ్చిబౌలిలోని సెంట్రల్ యూనివర్సిటీలో గురువారం పటాన్‌చెరు ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ గొట్టి శ్రీనివాస్‌రావు తన పరిశోధన గ్రంథం 'పోతన భాగవతం–అలంకార శిల్పం'ను ఆచార్య పిల్లలమర్రి రాములు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు, గోనానాయక్, పవన్‌కుమార్, విజయలక్ష్మి, వారిజారాణి, త్రివేది వంగరి, బాణాల భుజంగరెడ్డి, విజయకుమారి, లచ్చయ్య, భగ్గు నాయక్ ఉన్నారు.

విల్లాల పార్కుస్థలంలో ప్రైవేట్ వ్యక్తుల దౌర్జన్యం

- అది ముమ్మాటికీ పార్కుస్థలమే: మున్సిపల్ అధికారుల వివరణ

దుండిగల్, మార్చి14: మల్లంపేట్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీకి చెందిన పార్కుస్థలంలో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను కొందరు వ్యక్తులు జేసీబీలతో ప్రవేశించి, ధ్వంసం చేసి హంగామా సృష్టించారు. కాలనీవాసుల కథనం ప్రకారం.. దుండిగల్ మండలం, మల్లంపేట్‌లోని సర్వేనంబర్ 170/3, 170/5లో విజయలక్ష్మి అనే మహిళ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ పేరుతో 300పైగా విల్లాలు నిర్మించింది. అయితే ఇందులో కొన్నింటికి మాత్రమే హెచ్ఎండీఏ నుంచి అనుమతులు పొంది, అంతకన్నా ఐదు రేట్లు ఎక్కువ విల్లాలను నిర్మించినట్లు ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం విచారణ జరిపిన అధికారులు 2022 అక్టోబర్ 3న సుమారు 208 విల్లాలను నిషేధిత జాబితాలో చేర్చారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం కిరణ్ అనే వ్యక్తితో పాటు మరి కొందరు వ్యక్తులు విల్లాలోలని ప్రజాప్రయోజన (ఎమినిటీస్) స్థలంలో తమకు రిజిస్ట్రేషన్‌తో పాటు కోర్టు ఆర్డర్ ఉందంటూ ఏకంగా విల్లాల లోపల ఉన్న పార్కుస్థలంలోకి జేసీబీలతో వెళ్లి అందులో ఉన్న జిమ్ పరికరాలను తొలగించి, చదును చేసేందుకు యత్నించారు. గమనించిన అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ మహిళలు ప్రతిఘటించగా సదరు వ్యక్తులు కాలనీవాసుల పట్ల దౌర్జన్యం ప్రదర్శించారు. బూతులు తిడుతూ, మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించారు. దుండిగల్ మున్సిపాలిటీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును సైతం పీకేసి గుండాగిరికి దిగారు. దీంతో మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీస్‌వ్యాన్ అక్కడకు చేరుకోగానే గుర్తుతెలియని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, మహిళలు గురువారం రాత్రి దుండిగల్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా.. అది ముమ్మాటికీ పార్కుస్థలమేనని స్పష్టం చేశారు. తాము ఏర్పాటు చేసిన బోర్డును పీకి వేయడం పట్ల చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

సీఓ పాపాగౌడ్‌పై విచారణ చేపట్టాలి

గాజులరామా రం సర్కిల్–128 చింతల్ డివిజన్ యూసీడీ సీఓగా పని చేస్తున్న పాపాగౌడ్‌పై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల ప్రతినిధులు గురువారం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఫించన్ కార్డులు మంజూరైనా వాటిని ఇచ్చేందుడు పాపాగౌడ్ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని ఆరోపించారు. ఇలాంటి అధికారిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని కార్యాలయాధికారిణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్, మార్చి14

క్రీడాకారుడికి సన్మానం

కజకస్థాన్‌లో నిర్వహించిన అండర్–19 ప్రపంచ ఓపెన్ ఏషియన్ పవర్ లిఫ్టింగ్ విభాగంలో దేశానికి బంగారు పతకం సాధించిన ఊట్ల సాయి కౌశిక్‌ను శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అభినందించి సన్మానించారు. పాపిరెడ్డి కాలనీ వాస్తవ్యుడు ఊట్ల శ్రీనివాస్ ముదిరాజ్ కుమారుడు ఊట్ల సాయి కౌశిక్ రానున్న రోజుల్లో మరిన్ని ప్రపంచ పోటీల్లో పాల్గొని విజయవంతంగా ముందుకు సాగాలని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహకారం అందేలా కృషి చేస్తానని వి.జగదీశ్వర్ గౌడ్ హామీ ఇచ్చారు.

– శేరిలింగంపల్లి, మార్చి 14

హోర్డింగ్‌పైకి ఎక్కి హల్ చల్

దుండిగల్, మార్చి14: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి హోర్డింగ్‌పైకి ఎక్కి హల్ చల్ చేసిన ఘటన గురువారం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి సూరారం రహదారి పక్కన ఉన్న ఓ హోర్డింగ్‌పైకి గుర్తుతెలియని ఓ వ్యక్తి ఎక్కి హల్‌చల్ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న దుండిగల్ పోలీసులు అతడిని బుజ్జగించి క్రేన్ సహాయంతో కిందకు దించారు. అనంతరం అతడికి తినడానికి ఆహారం అందించారు. తనకు సంబంధించిన సరైన వివరాలు చెప్పకపోవడటంతోమతిస్థిమితం లేని వ్యక్తిగా పోలీసుల గుర్తించారు.

అట్టహాసంగా క్రాఫ్ట్ బజార్

మాదాపూర్, మార్చ్ 14: మాదాపూర్‌లోని నిఫ్ట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ)లో 'హస్తకళ ఉత్సవ్–2024' పేరిట నిర్వహించిన క్రాఫ్ట్ బజార్‌ను అట్టహాసంగా నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో చేనేత ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

మలేషియన్ టౌన్‌షిప్‌లో కిడ్నీ అవగాహన సదస్సు



కూకట్‌పల్లి రామ్‌దేవ్‌రావు వైద్యశాలలో కిడ్నీ అవగాహన సదస్సు

కిడ్నీల ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 14: మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని 'అపోలో హెల్త్ అండ్ లైఫ్ స్టైల్ లిమిటెడ్' సీఈవో శ్రీరామ్ అయ్యర్ అన్నారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీ మలేషియన్ టౌన్‌షిల్‌లో 'ప్రపంచ కిడ్నీ దినోత్సవం' సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వేదికపై ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూత్రపిండాల వ్యాధులు, సంరక్షణపై దృష్టిసారించాలని ముందస్తు జాగ్రత్తతోనే ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌షిప్ ప్రజలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

☛ కూకట్‌పల్లి రామ్‌దేవ్‌రావు వైద్యశాలలో ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల మెడికల్ డైరెక్టర్ కమలాకర్, గైనిక్ హెడ్ ఛాయాదేవి, సీఈవో ఎన్.యోబు మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధిత వ్యాధులపై అవగహన కలిగి ఉండడం ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు అఖిల, శోభ, రంగనాథ్, లావణ్య, రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స

గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి సత్తా చాటారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం నకిరేకల్‌కి చెందిన 9 ఏళ్ల మహమ్మద్‌కి గొంతులో ఇనుపరాడ్ గుచ్చుకోవడంతో ఊపిరిపీల్చుకోవడం, మాట్లాడడం కష్టంగా మారడంతో అతని తల్లిదండ్రులు గచ్చిబౌలిలోని కాంటినెంటల్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. వైద్యులు మహమ్మద్‌కు పరీక్షలు చేసి అత్యంత క్లిష్టతరమైన లెరింగో ట్రైకెల్ రీకన్స్ట్రక్షన్ అనే సర్జరీని లేరింగాలజిస్ట్ నిపుణుడు డాక్టర్ దుష్యంత్, ఆయన బృందం ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం బాలుడు కోలుకుంటున్నాడని, త్వరలోనే మాట్లాడుతాడని వైద్యులు వెల్లడించారు.

– శేరిలింగంపల్లి, మార్చి 14

యువకుడు మృతి

కొండాపూర్, మార్చి 14: రాంగ్‌రూట్‌లో ద్విచక్ర వాహనాన్ని నడిపిన ఓ యువకుడు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... న్యూ ఎంఐజీలో నివాసం ఉండే హిమబిందు, కీర్తిశేఖర్ దంపతులు తమ ద్విచక్ర వాహనం (ఏపీ04బీఎఫ్1407)పై వెళ్తుండగా, అదే సమయంలో ఓల్డ్ ఎంఐజీ సాయిబాబా దేవాలయం సమీపంలో నెహ్రూనగర్‌కు చెందిన శెట్టి అఖిలేశ్ (20), తన ఇద్దరు స్నేహితులతో కలిసి హోండా ఆక్టివా(టీఎస్07జేఎస్4592)పై రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో అఖిలేశ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా, వెనకాల కూర్చున్న ఇద్దరికి స్వల్ప గాయాలవ్వగా, అక్కడి నుంచి పారిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దుండిగల్, మార్చి 14: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లికి చెందిన అకినబోయిన అంజీయాదవ్‌కు ప్రధాన రహదారి వద్ద ఓ షట్టర్ ఉంది. ఈనెల 13వ తేదీన రాత్రి గుర్తుతెలియని ఓ వ్యక్తి సదరు షెట్టర్ ముందు పడిఉన్నట్లు తన వాచ్‌మెన్ ద్వారా సమాచారం అందుకున్న అంజీయాదవ్ వెంటనే సమాచారాన్ని దుండిగల్ పోలీసులకు చేరవేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వివరాల కోసం ప్రయత్నించగా ఎటువంటి ఆధారం దొరకలేదు. పరిసర ప్రాంతాల్లో విచారణ జరుపగా చుట్టుపక్కల దుకాణాలల్లో బిక్షాటన చేసేవాడని తెలిసింది. దీంతో మృతదేహాన్ని గాంధీవైద్యశాల మార్చురికీ తరలించారు. మృతుడి వయస్సు 58–60 ఏండ్ల మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో ఉన్న డాక్టర్ కాలనీ అభివృద్ధి పనుల కోసం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి గురువారం లక్ష రూపాయల విరాళాన్ని చెక్కు రూపేణా కాలనీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

– శేరిలింగంపల్లి, మార్చి 14

వలస కూలీ అదృశ్యం

దుండిగల్, మార్చి14: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. ఏపీలోని గారాలమడుగు, సీతారాంపేట్‌కు చెందిన దంపతులు చప్పిడి తిరుపతమ్మ, ఆహారోను (30) ఎనిమిదేండ్ల క్రితం సొంతగ్రామాన్ని వదిలి ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలసవచ్చారు. గండిమైసమ్మ మియాపూర్‌రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌పంప్ వెనుక ప్రాంతంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. దంపతులు ఇద్దరు రోజువారి కూలీలుగా పని చేస్తు జీవనోపాధిని పొందుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 12వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆహారోను రాత్రి పొద్దుపోతున్నప్పటికీ తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళనకు గురైన తిరుపతమ్మ ఆహారోను ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికింది. బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీసిన ఫలితం లేకపోవడంతో గురువారం దుండిగల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహారోను (ఫైల్)

గంజాయి చాక్లెట్ల విక్రయదారుడికి రిమాండ్

జీడిమెట్ల, మార్చి14: గుట్టుచప్పుడు కాకుండా కిరాణాషాపు మాటున గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న నిందితుడిని పక్కా ప్రణాళికతో బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసి పట్టుకుని, నిందితుడిని జీడిమెట్ల పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన శిబుకుమార్(19) నగరానికి వలస వచ్చి జీడిమెట్ల డివిజన్ రాంరెడ్డినగర్‌లో కిరణాకొట్టును నడిపించుకొని జీవనం సాగిస్తున్నాడు. కాగా గుట్టుచప్పుడు కాకుండా కిరాణాషాపులో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు చేపట్టగా ఈ దాడిలో గంజాయిచాక్లెట్లతో పట్టుబడ్డాడు. రూ.11,500 విలువ గల గంజాయి చాక్లెట్లను సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్, మార్చి 14: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... కూకట్‌పల్లి మాధవరం నగర్ కాలనీకి చెందిన అనగంటి శ్యాంకుమార్ (45) అనే వ్యక్తి ఓ చిట్ ఫండ్స్‌లో కలెక్షన్ ఇన్‌చార్జీగా పనిచేస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో బుధవారం తన తల్లిదండ్రులు, సోదరుడు నివాసం ఉంటున్న బహదూర్‌పల్లిలోని ఇందిరమ్మ కాలనీకి వచ్చాడు. రోజు మాదిరిగానే శ్యాంకుమార్ తల్లి, సోదరుడు శ్రీనివాస్ ఇద్దరు విధులకు వెళ్లారు. శ్యాంకుమార్ ఒక్కడే ఇంటివద్ద ఉన్నాడు. ఈ నేపథ్యంలో విధులు పూర్తి చేసుకుని రాత్రి ఇంటికి వచ్చిన తల్లి తలుపు కొట్టింది. శ్యాం స్పందించక పోవడంతో పాటు లోపలినుంచి గడియ వేసి ఉండటంతో ఆందోళనకు గురైన ఆమె ఇరుగు, పొరుగువారి సహాయంతో తలుపు బద్దలు కొట్టి చూడగా శ్యాంకుమార్ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. కిందకు దింపి పరిశీలించగా అప్పటికే శ్యాంకుమార్ మృ